
# గరీబీ హటావో

ఎం. రమణయ్య



అదొక పెద్ద ఆఫీసు. ఆ ఆఫీసులో ఆ
రోజు ఇంటర్వ్యూ వుంది. వరుసగా
క్యూలో నిలబడ్డారు కేండిడేట్స్. చూడ్డా
నికి ఆ క్యూ సినిమా హాలులో ఫస్టుక్లాసు
టిక్కెట్ల క్యూలా వుంది. టీనేజ్ వాళ్లు,
మిడిలేజ్ వాళ్లు వున్నారు. మెట్రిక్, పి.
యు. సి., ఇంటరుమీడియట్, బి. యే లు
వున్నాయి. గట్టి రికమెండేషన్స్ మోసు
గొచ్చినవారు కొందరు. దైవంమీద భార
మేసి వచ్చినవారు కొందరు. ఉన్నవి
రెండు క్యాజువల్ ప్యూన్ పోస్టులు. వచ్చిన
వాళ్లు ముప్పైమంది.

జారిపోతున్న కళ్ళద్దాలను ఎగదోసు
కుంటూ చిత్రగుప్తుడి చిట్టాలాంటి
పుస్తకాన్ని తిరగేసేసి ఒక్కొక్కరి
జాతకాలను వ్రాసుకుంటున్నాడు హెడ్
క్లర్కు.

క్యూ తరిగిపోతున్నది.
ఇంతలో ఆఫీసర్ బెల్ నొక్కేడు.

గదిలోనికి ప్యూన్ పరుగెత్తేడు. మళ్ళీ
అదే స్పీడులో పైకివచ్చి హెడ్‌క్లర్కుతో
ఏదో చెప్పేడు.

హై స్పీడులో పరుగెత్తేడు హెడ్
క్లర్కు,

క్యూ ఆగిపోయింది.

హెడ్‌క్లర్కు మళ్ళీ తిరిగివచ్చిసీటులో
కూర్చున్నాడు. ఆఫీసర్ ఏం చివాట్లేసేడో
ముఖం సీరియస్‌గా పెట్టాడు. ముఖంచిట్లిం
చుకుని ఒకసారి క్యూవైపు చిరాగ్గాచూసి
మళ్ళీ ఒక్కొక్కరి వివరాలడిగి వ్రాసు
కోవడంలో మునిగిపోయేడు.

వైట్‌పాంటు, సైడ్‌లాన్స్ హిప్పీలా
వున్న వ్యక్తిని చూసి ఆగిపోయేడు. వాడు
వుద్యోగం సక్రమంగా చేస్తాడా అన్న
అనుమానంగా క్షణంసేపు వానివైపు
చూసేడు.

చేస్తాను అన్నట్లుగా ఠీవిగా నవ్వేడు
ఆ వైట్‌పాంటు.

ఆఫీస్ రూంలోకి క్లర్కులు పరుగెత్తు
తున్నారు.... పైకి వస్తున్నారు. కొందరి
ముఖాలు వాడిపోతున్నాయి. కొందరివి
గులాబిల్లా వికసిస్తున్నాయి.

ఇంతలో కారు వచ్చి ఆగింది.

ఖరీదైన సిగరెట్ పొగ వదుల్తూ ఆఫీ
సర్ రూంలోకి వెళ్ళిపోయేడు ఒక వ్యక్తి.
మళ్ళీ పది నిముషాలలో తిరిగొచ్చి కారు
స్టార్టు చేసుకుని వెళ్ళిపోయేడు.

ఒక్కొక్క కేండిడేటు లోనికి వెళుతు
న్నాడు. ఆముదంతాగిన ముఖంలా ముఖం
వేసుకుని బయటకు వచ్చేస్తున్నాడు.
వాళ్ళనుచూచి మిగతా వాళ్ళు దడుసుకుం
టున్నారు. భయంతో బిగుసుకుపోతున్నారు.

"నిన్నేమిటడిగేడురా .... నిన్నేమిటడి
గేడు" బయట పెద్ద అలజడి. గుంపుగా
చేరి ఏవేవో చర్చించుకుంటున్నారు.
...ము పెద్ద సంతలా వుంది.

ఇంతలో ఫోను మ్రోగింది.

ఆఫీసర్ ఫోన్‌లో గుసగుసలాడేడు, కిలకిల నవ్వేడు. ఫోన్ పెట్టేసి రుసరుసలాడేడు.

ఇంతలో స్కూటరొచ్చి ఆగింది.

ఖరీదైన సూటు స్కూటర్ దిగి లోనికి వెళ్ళింది.

"క్యూ" ఆగిపోయింది.

స్కూటరు స్టార్టయింది.

మళ్ళీ "క్యూ" కదలడం మొదలు పెట్టింది.

ఒక్కొక్కరు లోనికి వెళుతున్నారు. ఆఫీసర్ ధాటికి తట్టుకోలేక నీరసంగా వచ్చేస్తున్నారు.

"డిపార్టుమెంటల్ కేండిడేట్సు ఎవరైనా వున్నారేమిటి?" ఫ్యూనుని బయటకు పిలిచి వ్యంగ్యంగా అడిగేడు ఒక వ్యక్తి.

"ఏమో తెలియదండి. ఉన్నా అల్లాంటివి తమరడగకూడదు. మేము చెప్పకూడదు" వెకిలిగా నవ్వేసి అక్కడి నుంచి జారుకున్నాడు ఫ్యూన్.

ఇంటర్వ్యూ ముగిసేసరికి సాయంత్రం ఐదున్నరయింది.

ఇంటిమేట్ చేస్తాం పొమ్మన్నాడు క్లర్కు.

ఆ ఇంటర్వ్యూ అయిన వారం రోజులకు నోటీస్ బోర్డుమీద పేర్లుచూసి ముఖాముఖాలు చూసుకున్నారు కేండిడేట్సు. ఆ వచ్చిన వారిలో ఒక్కరి పేరులేదు. అందులో, ఆ రెండు క్యాజువల్ ఫ్యూన్ పోస్టుల్లో మంత్రిగారి కేండిడేట్సు వెలిసేరు.

"జై గరీబీ హఠావో...."

★

